# తీరని ఋణం

-విరించి

సికింద్రాబాద్-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ పాలకొల్లు ప్లాట్‌ఫాం మీద ఆగింది. ప్లాట్‌ఫాం మీద దిగగానే ఒకసారి చుట్టూ పరికించి చూసాడు శేఖర్. అదే ప్లాట్‌ఫాం...సరిగా పదిహేనేళ్లక్రితం ఓ రెండు రోజులు కన్నతల్లిలా తమని అక్కున చేర్చుకుంది. దిక్కుతోచని స్థితిలో నిలువనీడయ్యింది. చలిగాలులనుంచి, జోరువానల నుంచి తమను కాపాడింది. ఈ ప్లాట్‌ఫాం, ఈ నేల, ఈ నీరు, ఈ గాలికి తనెంతో ఋణ పడి వున్నాడు.

గత జ్ఞాపకాలు తరుముకురాగా శేఖర్ కళ్లలో నీళ్లు తన్నుకువచ్చాయి. తనకప్పుడు పన్నెండేళ్లు. మున్సిపాల్టీ బడిలో సెవన్త్ క్లాస్ చదువుతుండేవాడు. అక్క టెన్త్ చదువుతుండేది. భగ్గేశ్వరం నుంచి పాలకొల్లు హైస్కూలుకు నాల్గు కిలోమీటర్లు చెప్పులు లేకుండా నడిచి వెళ్లి వచ్చేవాడు. ఎండవేడికి కాలిన కాళ్లకు రాయడాన్కి ఇంట్లో ఒక్కోసారి కొబ్బరినూనె కూడా ఉండేదికాదు.

అమ్మ మొదట్లో బాగానే ఉండేదిటగానీ, తనకు ఊహ తెల్సినప్పట్నుంచీ మతిస్థిమితం లేకుండానే ఉంది. నాన్న నాలుగు దుకాణాల్లో పద్దులు వ్రాస్తూ ఉండేవాడు. ఆ చాలీచాలని ఆదాయంతో బ్రతుకు దుర్భరంగా ఉండేది. తోటిపిల్లలంతా హాయిగా ఉంటే తనకే అలా ఎందుకుందో అర్థం అయ్యేది కాదు.

ఒకోరోజు అన్నం వండటాన్కి బియ్యం ఉండేవి కాదు. నాన్నకోసం చూసి చూసి అక్క ఆ పక్కింటికి ఈ పక్కింటికి వెళ్లి ఓ గ్లాసుడు బియ్యం తెచ్చేది. పొయ్యిలోకి ఉంటే పొయ్యి క్రిందకు ఉండేది కాదు. ప్రక్కనున్న సుబ్బరాజు గారి తోటలోకెళ్లి పుల్లలు ఏరుకుతెచ్చేవాడు తను. ఆరోజుకేదో భోజనం అయ్యిందన్పించేవాళ్ళం. నాన్న నాల్గు షాపుల్లో పద్దులు రాసి అలసిపోయి ఆలస్యంగా ఇంటికొచ్చేవాడు.

ఇంట్లో పరిస్థితి తెల్సు కాబట్టి "అమ్మలూ! ఆకలి లేదు. కాస్త మంచినీళ్ళు ఇయ్యి" అని నీళ్ళు తాగి పడుకునేవాడు. డబ్బు, కార్లు ఉన్న వాళ్లను చూస్తే తనకెందుకో దుగ్ధగా ఉండేది. పెద్దరాయి తీసుకొచ్చి వాళ్ల తల బద్దలు కొట్టాలన్పించేది.

ఒకరోజు నాన్న చేయి పట్టుకొని బజార్లో వెళ్తూంటే ఓ పెద్ద ఇల్లు చూపించాడు నాన్న. ఒకప్పుడు తాత, ఆ తర్వాత నాన్నా అందరూ దాంట్లో ఉండేవారట. ఆ తర్వాత షావుకారు నారాయణశెట్టి తాతకిచ్చిన అప్పుకు వడ్డీకి వడ్డీ కట్టి ఆ ఇల్లు లాక్కున్నాట్ట. ఆ ఇల్లు చూసినప్పుడల్లా తనకెందుకో చాలా బాధగా ఉండేది. పెద్దయ్యాక పెద్ద ఉద్యోగం చేసి ఆ ఇల్లు మళ్లీ శెట్టి దగ్గర్నుంచి లాక్కోవాలి అనుకునేవాడు తను.

ఊరు చివర్న ఉన్న ఆ పెంకుటిల్లుకు అప్పట్లో అద్దె ఓ యాభై రూపాయలు. ఆ అద్దె కూడా ఆరునెలలుగా బాకీ. ఇంటి యజమాని భార్య పరమగయ్యాళి. ఓ రోజు ఉదయమే నాన్నతో గొడవపెట్టుకుంది.

"ఇదిగో పంతులుగారూ! ఆరు నెలల అద్దె ఈరోజు ఇయ్యకపోతే తక్షణం ఇల్లు ఖాళీ చేసి పొండి" అంది కాంతమ్మ.

నాన్న ఎదురు మాట్లాడలేదు. 'అలాగే' అన్నట్లు తల ఊపాడు.

అక్క, తను స్కూలుకు వెళ్ళిపోయాం. సాయంత్రం స్కూలునుంచి వచ్చేటప్పటికే నాన్న సామాన్లన్నీ మూటలుగా కట్టి ఓ రూంలో పడేశాడు. స్కూలు బ్యాగ్‌లు అలమరలో పెట్టి, కాళ్లు చేతులు కడుక్కుని వచ్చేటప్పటికి నాన్న ఆ గదికి తాళం వేశాడు. తనకేం అర్థం కాలేదు.

"నాన్నా! ఏం చేస్తున్నారు? ఇల్లు మారుతున్నామా? ఊరెళ్లుతున్నామా?" అక్క నాన్నను అడుగుతోంది.

"అమ్మను తీస్కుని బయటకు పద. చెప్తాను" అన్నాడు నాన్న.

అక్క వాటర్ బాటిల్ తీసుకుని, అమ్మ చెయ్యి పట్టుకుని బయటకు నడిచింది. తను అక్కను అనుసరించాడు. నాన్న ఇంటికి తాళం వేసి ఇంటి తాళం చెవులు కాంతమ్మ చేతిలో పెట్టాడు.

"అమ్మా! సామాన్లన్నీ ఓ గదిలో పడేశా. మిగతా ఇల్లు ఎవరికైనా ఇచ్చుకో. నీ అద్దె ఇచ్చే సామాన్లు తీసుకెళ్తా" అన్నాడు నాన్న.

"అదే! అద్దె ఎప్పుడు ఇస్తారు?"

"తప్పకుండా. రెండు రోజుల్లో" అన్నాడు నాన్న.

నాన్న చెయ్యి పట్టుకొని నడవడం ప్రారంభించాడు తను. నెమ్మదిగా తమ నడక రైల్వే స్టేషన్ వైపు సాగుతోంది. తనకు రైలెక్కడమంటే సరదా. నాన్న ఏదో ప్రయాణం పెట్టాడనుకున్నాడు తను. అప్పటికే సాయంత్రం ఆరు ఆరున్నర అయ్యింటుంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు. నర్సాపూర్ నుంచి సికింద్రాబాద్ పోయే ఎక్స్‌ప్రెస్ కూడా వెళ్లిపోయింది. ఆ తర్వాత ట్రయిన్స్ ఏమీ లేవు. ప్లాట్‌ఫాం నిర్మానుష్యంగా ఉంది. ప్లాట్‌ఫాం చివర ఓ సిమెంటు బెంచిమీద కూర్చోబెట్టాడు నాన్న. నాన్న ఏం చెయ్యబోతున్నాడో తెలియదు. అడిగే ధైర్యం తనకు లేదు. నెమ్మదిగా చీకటిపడింది. ఆకాశం మేఘావృతమైంది. అప్పుడే చిన్నగా చినుకులు పడుతున్నాయి.

"మీరిక్కడే ఉండండి. అన్నపూర్ణ కేంటిన్‌కెళ్లి టిఫిన్ తెస్తాను" అన్నాడు నాన్న.

మతిస్థిమితంలేని అమ్మకు టెన్షన్‌లేదు. నిర్వికారంగా చూస్తోంది. అక్క ఏదో అడగబోయింది. నాన్న వినేస్థితిలో లేడు. తనకెందుకో భయంగా వుంది. అక్క తనను దగ్గరకు తీసుకుంది. అరగంటలో నాన్న ఇడ్లి, సాంబారు పొట్లాలతో వచ్చాడు. ఆవురావురుమంటూ తామంతా తిన్నాం.

"నాన్నా! ఇక్కడకెందుకు తీసుకొచ్చావ్?" అక్క ధైర్యంచేసి కాస్త గట్టిగానే అడిగింది.

"ప్రస్తుతం ఇదేనమ్మా మన ఇల్లు. కాంతమ్మకు అద్దె ఇస్తేనేగాని ఊర్కోదు. రెండు రోజుల్లో నాకు రావాల్సిన డబ్బులొస్తాయ్. అప్పుడు వేరే ఇల్లు చూసుకుందాం!" అన్నాడు నాన్న.

"నాన్నా!..." అక్క మాట్లాడలేకపోయింది.

"తప్పదు తల్లీ!" అన్నాడు నాన్న.

వర్షం ప్రారంభమయ్యింది. గాలికూడా తోడయ్యింది. బెంచిమీద నుంచి లేచి వర్షంపడని చోటుకు వచ్చాం. అటుగా వెళ్తున్న లైసెన్సు కూలి నాన్నని చూసి ఆగాడు.

"పంతులుగారూ! ఈ ఏళప్పుడు ఇక్కడున్నారేటి? ఈ టయిములో బళ్ళేం లేవుకదా!" అన్నాడు.

నాన్న మాట్లాడలేదు.


"చెప్పండి బాబూ!"

పదిసార్లు రొక్కించి అడగ్గా నాన్న చెప్పాడు.

"అదేటి బాబూ! తవరి నాన్నగారు మాకెంతో ఉపకారం చేసారు. మా ఇంటికి వెల్దాం రండి" అన్నాడు ఆప్యాయంగా.

"వద్దులే నాగన్నా!" అన్నాడు నాన్న.

అతను స్టేషన్ మాస్టర్ దగ్గరకు పరుగెత్తుకెళ్ళి,



ఏం చెప్పాడో, వెయిటింగ్ రూం తాళాలు తెచ్చాడు.

ఆ రాత్రి వర్షంనుంచి, చలినుంచి ఆ వెయిటింగ్ రూమే రక్షించింది. తెల్లారేక నాన్న మళ్లీ ఇడ్లి, కాఫీ తెచ్చిచ్చాడు. ఆరోజు అక్క, తను స్కూలు కెళ్లలేదు. బట్టలు మార్చుకోలేదు. కట్టుబట్టలతో తీసుకొచ్చాడు నాన్న. ఆ వెయిటింగ్ హాలే గెస్ట్‌హౌస్ అయ్యింది. పాలకొల్లు పల్లెటూరు కాదు. పెద్ద సిటీకాదు. ఓ మాదిరి పట్టణం. ఆ ఊళ్లో పాసింజర్లు ఎవ్వరూ వెయిటింగ్ హాలు ఉపయోగించకపోవడం తమకు వరంగా మారింది.

ఆ మునిమాపువేళ దూరంగా ఓ మనిషి వేగంగా తమవైపుకు రావడం నాన్న గమనించాడు.

"పాల సుబ్బయ్య" నాన్న నెమ్మదిగా అన్నాడు. అతనికి కూడా నాల్గు నెలల పాలబాకీ ఉన్నట్లుంది. అందుకే వస్తున్నాడు అనుకున్నాడు తను.

రాగానే అతను నాన్న రెండు చేతులు పట్టుకున్నాడు.

"పంతులుగారూ! ఎంతపని చేసారు? ఈ సుబ్బయ్య చచ్చాడనుకున్నారా?" అన్నాడు బాధపడుతూ.

"ఛ! అదేంమాట సుబ్బయ్యా?" అన్నాడు నాన్న.

"ఏంటి బాబూ ఇది! పాలు పోద్దామని ఇంటికెళ్తే కాంతమ్మ చెప్పింది ఇల్లు ఖాళీ చేసారని. ఇప్పుడు కేంటీన్ కాడ నాగన్న చెప్పాడు. తమర్ని వెయిటింగ్ రూంలో పెట్టేనని" అన్నాడు సుబ్బయ్య కళ్ళనీరు పెట్టుకుంటూ "పదండి బాబూ! ఇంటికి పోదాం"

"నీకెందుకులే సుబ్బయ్య శ్రమ! రెండు రోజుల్లో డబ్బులొచ్చేదుంది. ఏదో ఇల్లు చూస్కొని వెళ్తాంలే" అన్నాడు నాన్న.

"మీరు నాతో రాకపోతే నా మీద ఒట్టు" అని సుబ్బయ్య రిక్షా తీసుకొచ్చి బలవంతంగా రిక్షా ఎక్కించాడు. సుబ్బయ్యకు నాల్గు ఎకరాల పొలం, నాల్గయిదు పాడి గేదెలున్నాయి. సుబ్బయ్యకు పొలం దగ్గర మరో చిన్న ఇల్లుంది. ఆ ఇంటి దగ్గరకు రిక్షా పోనిచ్చాడు.

"పంతులుగారూ! మీకిష్టమొచ్చినంత కాలం దీంట్లో ఉండండి. కానీ అద్దె ఇవ్వక్కర్లేదు. నేనూ పిల్లలుకలవాడ్ని. మీ బాధలు నాకు తెల్సు" అన్నాడు సుబ్బయ్య.

"నీ ఋణం ఎలా తీర్చుకోను సుబ్బయ్యా?" నాన్న రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టాడు.

మర్నాడు ఉదయమే కాంతమ్మకు అద్దెకట్టి ఇంటి సామాన్లు వ్యాన్‌లో వేసుకొచ్చాడు సుబ్బయ్య. అప్పట్నుంచి అడపాదడపా సుబ్బయ్య సాయం చేస్తూనే ఉన్నాడు. అక్క, తను స్కూలుకు వెళ్తొస్తున్నారు. అలా ఆరు నెలలు గడిచింది.

ఓ రోజు ఉదయమే సుబ్బయ్య చిన్న కొడుకు వచ్చాడు.

వస్తూనే "పంతులుగారూ" అంటూ గట్టిగా పిలిచాడు. నాన్న బయటకు రాగానే "నమస్కారం పంతులుగారూ!" అన్నాడు.

"ఏం సత్యం? ఏమిటి సంగతి?" అన్నాడు నాన్న.

"ఆరు నెలలనుంచి అప్పనంగా ఉన్నారు. అద్దె ఇవ్వరు. ఎవరి బాబు సొమ్ము? మా నాన్నకు బుద్ది లేకపోతే తమరికి ఉండొద్దా? బేవార్సుగా ఉండటాన్కి సిగ్గుగాలేదా?" తాగి వచ్చినట్లున్నాడు, ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు.

"సత్యం! తర్వాత మాట్లాడుతాను. నువ్వెళ్లిరా" అన్నాడు నాన్న.

"ఈరోజు అద్దె ఇచ్చేదాకా ఎళ్లను" అన్నాడు తూలుతూ.

నాన్న వాడి పరిస్థితి గమనిచి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఇంటోకి వెళ్లిపోయాడు. ఎదురింటి కిరాణా కొట్టు షావుకారు వాడ్ని నాల్గు చివాట్లు పెట్టి లాక్కుపోయాడు. ఆ మర్నాడు ఉదయమే సుబ్బయ్య వచ్చాడు.

"పంతులుగారూ! మీరియ్యాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు రావాలి" అన్నాడు.

"ఏం సుబ్బయ్యా? ఏమిటీ హడావుడి?"


"ఈ ఇల్లు నా పేరన ఉండబట్టేకదా మావోడు మిమ్మల్ని నానా మాటలాడింది. ఇక ఈ ఇల్లు, మీ పేర్న రిజిస్ట్రీ చేయించేస్తా. మిమ్మల్నెవరూ అద్దె అడగరు" అన్నాడు సుబ్బయ్య.

"సుబ్బయ్యా! నువ్వు ఆవేశపడకు. చిన్నపిల్లాడు ఏదో తెలిసీ తెలియక అన్నాడని నువ్వు సీరియస్‌గా తీసుకోకు"

"వాడా చిన్నపిల్లాడు? వాడి మొహం ఇక జీవితంలో చూడను" అన్నాడు చాలా దృఢంగా.

నాన్నకు పరిస్థితి అర్థమయ్యింది. తనవల్ల సుబ్బయ్య కుటుంబంలో కలతలొస్తున్నాయని గ్రహించాడు.

"సుబ్బయ్యా! నువ్వు ఎటువంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోకు. నువ్వేం బాధపడకు, నువ్వు ఇంటికెళ్ళు తర్వాత మాట్లాడ్తా" అన్నాడు నాన్న.



## ఐన్‌స్టీన్ నిర్ణయం

జర్మనీలో జన్మించిన యూదుడైన పాపానికి హిట్లర్ పరిపాలనలో ఎన్నో కష్టాలు పడ్డాడు ఐన్‌స్టీన్. అమెరికాకు వలస వెళ్లాడు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత యూదుల కోసం ఇజ్రాయెల్ ఏర్పడింది. ఆ దేశానికి అధ్యక్షుడిగా ఉండాలని కోరుతూ ఐన్‌స్టీన్‌ని ఆహ్వానించారు. అయితే ఆయన ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు.

-ఎన్.ఎల్.ఎన్.మూర్తి



సుబ్బయ్య అయిష్టంగానే లేచాడు. ఆ తర్వాత నాలుగు రోజులు ఇంట్లో భోజనం చెయ్యలేదని తెల్సింది. ఆ విషయంలో సుబ్బయ్య ఇంట్లో ఘర్షణ జరుగుతున్నట్లు తెల్సి నాన్న బాధపడ్డాడు.

ఓ రోజు ఉదయం నాన్న తెల్లవారుఝామునే లేచారు.

"అమ్మలూ! అలా తణుకుదాకా పోయొస్తా. అక్కడ నా స్నేహితుడొకడు ఏదో పని ఉంది రమ్మన్నాడు. రెండు రోజుల్లో వస్తాను. జాగ్రత్త'' అని చెప్పి మొదటి బస్‌కే బయల్దేరాడు.

రెండు రోజుల తర్వాత బాగా ప్రొద్దుపోయాక వచ్చాడు నాన్న. రాగానే స్నానం చేసి, అన్నం తిన్నాక అక్కను పిలిచాడు.

"అమ్మలూ! మనం ఇక్కడ ఉండటం శ్రేయస్కరం కాదు. మనవల్ల సుబ్బయ్య కుటుంబంలో కలతలు వస్తున్నాయి. ఈ తెల్లవారు ఝామునే వ్యాన్ వస్తుంది. ఆ వ్యాన్‌లో సామాన్లు వేసుకొని తణుకు వెళ్లిపోదాం. అక్కడో చిన్న ఉద్యోగం దొరికిందిలే'' అన్నాడు నాన్న. తను పడుకునే అన్నీ వింటున్నాడు.

"మరి సుబ్బయ్యకు చెప్పకుండా వెళ్లిపోతే బాధపడ్తాడేమో నాన్నా!'' అంది అక్క.

"చెప్తే మనల్ని వెళ్లనివ్వడు. అతను కనిపించే దేవుడు. దేవుడు అడిగితేనే వరాలిస్తాడు. సుబ్బయ్య అడక్కుండానే మనల్ని ఆదుకున్నాడు. ఇప్పటికే మనం చాలా శ్రమ ఇచ్చాం. అతని మంచితనాన్ని భరించడం నా వల్లకాదు'' అన్నాడు నాన్న బాధగా. అక్క మాట్లాడలేదు.

ఆ తెల్లవారుఝామున తను నిద్రమత్తులో ఉండగానే నాన్న తనను ఎత్తుకొని వ్యాన్ ఎక్కించాడు. తెల్లవారకముందే కొత్త ఊరు, కొత్త ఇల్లు, కొత్త వాతావరణంలో ప్రవేశించాం.

ఆ తర్వాత అక్క, తను చాలా పట్టుదలగా చదివి డిగ్రీలు పాసవడం, నెమ్మదిగా మకాం హైదరాబాద్‌కు మార్చడం, అక్క పెళ్లి అయిపోవడం, తను గ్రూప్-1 పాస్ అయి, నర్సాపురం ఆర్.డి.వోగా పోస్టింగ్ రావడం జరిగిపోయాయి. ఎక్కడైతే నానా అగచాట్లు పడ్డాడో అక్కడే మంచి హోదాగల ఉద్యోగం రావడంతో నాన్నకు ఎంతో ఆనందం కలిగింది.

"ఒరేయ్ శేఖర్! నువ్వు మొట్టమొదటగా సుబ్బయ్య కాళ్లకు నమస్కరించి, ఆశీర్వచనం తీసుకొని ఉద్యోగంలో చేరు. అతనే ఆదుకోకపోతే ఈవేళ ఇలా ఉండేవాళ్ళంకాదు'' నాన్న అదే మాట పదే పదే అన్నాడు.

అందుకే తను పాలకొల్లులో దిగింది.

"సార్! ఆటో కావాలా?'' ఆటోవాడి కేకతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు శేఖర్.

పాలకొల్లు స్టేషన్ బాగా మారిపోయింది. ప్లాట్‌ఫాం చాలా పెద్దదిగా కట్టారు. ఇదివరకు ఒకటే ప్లాట్‌ఫాం ఉండేది. ఇప్పుడు రెండో ప్లాట్‌ఫాం కట్టారు. ఒకప్పటి రిక్షాలు, జట్కాల స్థానంలో ఇప్పుడు ఆటోలు వచ్చాయి.

ఆటో ఎక్కి 'భగ్గేశ్వరం పోనియ్'' అన్నాడు. దార్లో పెద్ద పూలదండ, పళ్ళు, స్వీట్స్ కొన్నాడు. వెళ్లగానే పెద్ద దండ సుబ్బయ్య మెడలో వేసి, పళ్ళు, స్వీట్స్ ఇచ్చి కాళ్లకు నమస్కరించాలి. ఇంతకాలానికి తనని చూసినందుకు సుబ్బయ్య ఎంత ఆనందపడ్డాడో? 'అబ్బాయిగారూ!'' అంటూ తనని కౌగిలించుకోడూ?

శేఖర్ ఆలోచన్లలో ఉండగానే భగ్గేశ్వరం వచ్చేసింది. సుబ్బయ్య ఇంటి దగ్గర జనం చాలామంది ఉన్నారు. ఏవో బాజాలు విన్పిస్తున్నాయి. నెమ్మదిగా జనాన్ని తోసుకుంటూ ముందుకెళ్లాడు. సన్నగా ఏడుపులు వినిపిస్తున్నాయి. అక్కడి సన్నివేశం చూడగానే నిశ్చేష్టుడయ్యాడు. శేఖర్ కళ్లు వరద గోదారులయ్యేయి.


సుబ్బయ్య నిశ్చలంగా శాశ్వత నిద్రలో ఉన్నాడు. తల దగ్గర దీపం. ఓ పక్క భార్య, మరోపక్క బంధువులు, కొంచెం దూరంలో కొడుకులు, కూతుళ్లు, మనవలు విచారవదనాల్తో ఉన్నారు.

ఎవరో అంటున్నారు. 'ఎవరికి కష్టం వచ్చినా చూడలేక పోయేవాడు. అందరి కష్టాలు తన కష్టాలుగా భావించేవాడు. ఎప్పుడూ ఆ పంతులుగారు చెప్పకుండా వెళ్ళిపోయారని బాధపడ్తుండేవాడు''

అటుకేసి చూసాడు శేఖర్. తమ ఇంటికెదురుగా ఉండే కిరాణా కొట్టు షావుకారు. తనని గుర్తుపట్టలేదు. శేఖర్ మౌనంగా స్వీట్సు, పళ్ళు ఓ ప్రక్కన పెట్టాడు. తెచ్చిన పెద్ద పూలదండ సుబ్బయ్య దేహంపై పెట్టి, రెండు కాళ్లు పట్టుకుని దుఃఖాన్ని ఆపుకోలేక వలవల ఏడ్చాడు.

'మమ్మల్ని క్షమించు సుబ్బయ్యా!' మౌనంగా పదే పదే అనుకున్నాడు, కనిపించే దేవుడు కనుమరుగయ్యాడు.

★



## సస్పెన్స్!

పాత సినిమాలని రీమేక్ చేయడం, సీక్వెల్స్ తీయడం ఇప్పుడు ఫ్యాషన్ అయిపోయింది. చిరంజీవి నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోక సుందరి' సినిమా కూడా తిరిగి రూపొందబోతోందిట. ఇందులో చిరంజీవి తనయుడు 'చరణ్' నటిస్తాడనేది ఫిలిం నగర్‌లో విని పిస్తున్న వార్త. దాదాపు పద్దెనిమిదేళ్ల క్రితం వచ్చిన ఆ సినిమాని రీమేక్ చేయడమా? లేక సీక్వెల్‌గా పాత్రల్ని కంటిన్యూ చేసి తీయడమా అనేది ఇంకా చర్చల్లో వుందిట. అప్పటిదాకా సస్పెన్స్ అంటున్నారు సినీజనాలు.

